క్లుప్తంగా

## వేసవిలో నీటి సమస్య లేకుండా చర్యలు


కొత్తచెరువుతండాలో నల్లాలను పరిశీలిస్తున్న ఏఈ, పంచాయతీ కార్యదర్శి

కౌడిపల్లి(నర్సాపూర్): వేసవి సందర్భంగా గ్రామాలు, తండాల్లో నీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్ తెలిపారు. సోమవారం మండలంలోని కొత్తచెరువుతండా, రాయిలాపూర్ తదితర పంచాయతీల్లో రక్షిత మంచినీటి పథకం ట్యాంక్, బోర్‌బావులు, మోటార్, పైప్‌లైన్, నల్లలు, మినీట్యాంక్ ఇతర నీటి వసతిని పరిశీలించారు. వేసవిలో మంచినీటి సమస్య రాకుండా జనాభాకు అనుగుణంగా మంచినీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నీటి సమస్య వస్తే బోర్లు లీజుకు తీసుకునే అవకాశాలను సైతం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సిరాజొద్దీన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## మురికి కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు

నర్సాపూర్: నియోజకవర్గానికి రూ.10 కోట్ల నాలుగు లక్షలు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 172 గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో మురికి కాల్వలు, సీసీ రోడ్లు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వివరించారు.

## అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు


ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న ఏఓ

కౌడిపల్లి(నర్సాపూర్): అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ స్వప్న హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రం కౌడిపల్లిలోని డీసీఎంఎస్, ఆగ్రోస్ రైతుసేవా కేంద్రం, భాగ్యలక్ష్మి ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. అధిక ధరలకు యూరియా విక్రయించినట్లు ఆరోపణలు రావడంతో మూడు దుకాణాలకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులు విక్రయించాలని చెప్పారు.

## వైభవంగా ఎల్లమ్మ బోనాలు


ఉత్తులూర్‌లో బోనాల ఊరేగింపు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని ఉత్తులూర్ గ్రామంలో రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం సాయంత్రం గ్రామపురవీధుల నుంచి శివారులోని ఎల్లమ్మ ఆలయం వరకు శివసత్తుల నృత్యాల మధ్య మహిళలు బోనాలు ఊరేగింపుగా తీసుకొని వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

## దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మెదక్ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని, ప్రజాసంక్షేమాన్ని విస్మరించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి నర్సమ్మ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దేశ అభివృద్ధిని బలహీనపరిచేలా కేంద్ర బడ్జెట్ ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మల్లేశం, జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, అజయ్, నాయకులు లచ్చగౌడ్, నాగమణి, సత్యం, భాను, తదితరులు పాల్గొన్నారు.


చిలప్‌చెడ్(నర్సాపూర్): జగ్గంపేటలో చిన్నారులకు పలకల పంపిణీ


పెద్దశంకరంపేటలో సరస్వతి శిశుమందిర్‌లో సామూహిక అక్షరాభ్యాసం


రేగోడ్(మెదక్): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో..


ప్రత్యేక అలంకరణలో సరస్వతిమాత


రామాయంపేట(మెదక్): శిశుమందిర్‌లో..


శివ్వంపేట(నర్సాపూర్): కుంకుమార్చనలో భక్తులు


వెల్దుర్తి(తూప్రాన్): కుకునూర్‌లో..

## సకల విద్యా స్వరూపిణీ నమోస్తుతే

జిల్లా వ్యాప్తంగా సోమవారం పంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో, కళాశాలల్లో, ఆలయాల్లో సరస్వతిమాతకు ప్రత్యేక పూజలు చేసి, చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.

# ఎస్సీ వర్గీకరణ చేయాల్సిందే..

ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు అమర్

నిజాంపేట(మెదక్): ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని సోమవారం వేయి గొంతుకలు, లక్షల డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వాల్‌పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు అమర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు సుధాకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాక్షుడు కొమ్మాట రాజు, ప్రధాన కార్యదర్శి పాపిరాజు, నాయకులు స్వామి, స్వామి, భాను, విజయకుమార్, రమేశ్, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

**సభకు తరలిరండి**

రామాయంపేట(మెదక్): పట్టణంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు లక్ష డప్పులు – వేయి గొంతులు సమావేశానికి సంబంధించి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాలోని మాదిగ, ఉప కులాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హైదరాబాద్ సభకు తరలిరావాలని సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు పాతూరి రాజు, లద్ద నర్సింలు, జిల్లా అధ్యక్షుడు మల్యాల కిషన్, ఇతర ప్రతినిధులు అనిల్, దుర్గం, సంజీవ్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ నెల 7న నిర్వహించనున్న హలో మాదిగ – చలో హైదరాబాద్ కార్యక్రమంలో వేల సంఖ్యలో మాదిగలు పాల్గొని జయప్రదం చేయాలని మండల ఇన్‌చార్జి దుర్గాదాస్ అన్నారు. ఆయన మండల కేంద్రంలో హలో మాదిగ – చలో హైదరాబాద్ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రతీ ఊరు నుంచి ఒక బస్సు, ప్రతీ ఇంటి నుంచి ఒక డప్పు తీసుకొని పట్నం తరలి రావాలన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం.. ఎస్సీ వర్గీకరణ తీర్మానం చేసేలా మన దండోరా వినిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ప్రసాద్, గౌరవాధ్యక్షుడు వీరయ్య, హత్నూర మండల ఇన్‌చార్జి మొగిలయ్య, నాయకులు మంటోళ్ల మాణెయ్య, శేఖర్, అబ్రహం, బాలేశ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.


నిజాంపేటలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


మాసాయిపేటలో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**పోస్టర్ ఆవిష్కరణ**

వెల్దుర్తి(తూప్రాన్): ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈ నెల 7న మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు.. వేల గొంతులు మాదిగల సాంస్కృతిక మహా ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు యాదగిరి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం మహా ప్రదర్శనకు సంబంధించిన వాల్ పోస్టర్లను మండల కేంద్రం మాసాయిపేటలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## చాకరిమెట్లలో ఎమ్మెల్యే పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): వసంత పంచమిని పురస్కరించుకొని చాకరిమెట్ల సహకార ఆంజనేయ స్వామిని, సరస్వతిమాతను ఎమ్మెల్యే సునీతారెడ్డి దర్శించుకున్నారు. సోమవారం ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, సిబ్బంది రామకృష్ణ ఉన్నారు.


ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

## నెల రోజుల వ్యవధిలోనే భార్యాభర్తలు మృతి

నార్సింగిలో శ్రీనివాస్‌గౌడ్ భార్య జ్యోతి గుండెపోటుతో మృతి


జ్యోతి

చిన్నశంకరంపేట(మెదక్): నెల రోజుల వ్యవధిలోనే భార్య భర్తలు గుండెపోటుతో మృతి చెందిన సంఘటన నార్సింగి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. నార్సింగి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌గౌడ్ జనవరి 11న గుండెపోటుతో మృతి చెందగా, సోమవారం ఆయన భార్య జ్యోతి గుండెపోటుకు గురై మృతి చెందింది. నెల రోజుల వ్యవధిలోనే భార్య భర్తలు ఇద్దరు గుండెపోటుతో మృతి చెందారు. దీంతో నార్సింగిలో విషాదం నింపింది. కాగా కొడుకు మృతి తట్టుకోలేక శ్రీనివాస్‌గౌడ్ తల్లి కూడా పక్షవాతంకు గురి కావడంతో ఆమె ఆస్పత్రిలో చేర్చారు. భర్త మరణం తట్టుకోలేక ఆవేదనతో ఉన్న భార్య మృతి చెందడంతో ఆ కుటుంబం కోలుకోలేని పరిస్థితి నెలకొంది. కుమారుడు దయాకర్ డిగ్రీ ఫైనల్ ఇయర్, కూతురు మానస డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు.

## బీజేపీ జిల్లా అధ్యక్షుడికి అభినందనలు

వెల్దుర్తి(తూప్రాన్): బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ ఎంపిక కావడంపై ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు నర్సింలు హర్షం వ్యక్తం చేశారు. బీజేవైఎం నాయకుడు నవీన్‌తో కలిసి మల్లేశ్‌గౌడ్‌ను మెదక్‌లోని పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. నూతన అధ్యక్షుడి నేతృత్వంలో జిల్లాలో పార్టీ మరింత పటిష్టం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.


నూతన అధ్యక్షుడితో నర్సింలు

# అన్ని కోణాల్లో విచారణ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సామ్య తండాలో హత్యకు గురైన మదన్‌లాల్‌కు సంబంధించి అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు తూప్రాన్ సీఐ రంగాకృష్ణ అన్నారు. సోమవారం తండాలో మదన్‌లాల్ అంత్యక్రియలు పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించారు. తండాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. మృతుడి చెల్లి సరిత ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. శనివారం రాత్రి మదన్‌లాల్ ఇంటికి కారులో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చినట్లు తెలుస్తుంది. కారుకు సంబంధించి వివరాలు వెలుగులోకి వస్తే ఎదైన క్లూ దొరుకుతుందోనని పోలీసులు అందుకు సంబంధించి పరిసరాల్లో సీసీ కెమెరాలు, ఇతర మార్గాల ద్వారా అన్వేషిస్తున్నారు. త్వరలో హత్యకు పాల్పడిన నిందితులను పట్టుకుంటామని సీఐ వివరించారు.


తండాలో పరిస్థితిని సమీక్షిస్తున్న సీఐ, ఎస్‌ఐ

## పాఠశాలలో టాయిలెట్స్ ఏర్పాటు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని ఎస్టీ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో నూతనంగా నిర్మించిన బాత్‌రూంలు, మరుగుదొడ్లను మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. మదన్‌రెడ్డి సొంత కాంప్లెక్స్‌లో ఎస్టీ గురుకుల పాఠశాల, కళాశాల అద్దెకు ఉన్నాయి. రూ. 56లక్షలతో అత్యాధునిక టాయిలెట్స్ నిర్మించి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫణికుమార్, వైస్‌ప్రిన్సిపాల్ మంజుల, భవాని, సొసైటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ శివాంజనేయులు, నాయకులు నవీన్‌రావు, శాఖయ్య, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



## నిధులు కేటాయించకపోవడం దారుణం

మిరుదొడ్డి(దుబ్బాక): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించక పోవడం దారుణమని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్ స్వామి గౌడ్ వాపోయారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలు ఉండి కూడా రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో విఫలమయ్యారన్నారన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం తెలంగాణపై కక్ష సాధింపు చర్యలు అవలంభిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు కమలాకర్, బాలు యాదవ్, పద్మాగౌడ్, సురేందర్‌రెడ్డి, సుధాకర్, చందు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకట్‌స్వామి గౌడ్

## పదవులు శాశ్వతం కావు

దుబ్బాక: పదవులు శాశ్వతం కావని, చేసిన సేవలే ప్రజల గుండెల్లో పదిలంగా ఉంటాయని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గన్నె వనితారెడ్డి అన్నారు. 18వ వార్డు బీఆర్‌ఎస్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను కౌన్సిలర్‌గా గెలిపించి చైర్‌పర్సన్‌ను చేసిన 18 వ వార్డు ప్రజలను జీవితంలో మరువలేన్నారు. పదవులు ఉన్నా లేకున్నా ప్రజల కష్ట సుఖాల్లో అండగా ఉంటానని చెప్పారు. నాయకులు దుబ్బయ్య, మధు పాల్గొన్నారు.


వనితారెడ్డి దంపతులను సన్మానిస్తున్న నాయకులు

### బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రాములు



రామాయంపేట(మెదక్): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా మండలంలోని అక్కన్నపేటకు చెందిన రాగి రాములు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ ఉత్తర్వులు విడుదల చేశారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకుగాను రాములు ఎంపీ రఘునందన్ రావు, ఎండల, ఇతర నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

### ఉద్యమకారులు పార్టీని వీడడం లేదు


రమేశ్

రామాయంపేట(మెదక్): ఉద్యమ నాయకులెవరూ బీఆర్‌ఎస్‌ను వీడటం లేదని ఆ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కర్రె రమేశ్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఒకరిద్దరు వెళ్లిపోయినంత మాత్రాన పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు. కార్యకర్తలు అధైర్యపడొద్దని అన్నారు. మళ్లీ బీఆర్‌ఎస్‌కు మంచి రోజులు వస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల తిరుగబాటు ప్రారంభమైందని పేర్కొన్నారు. కేసీఆర్ రంగంలోకి దిగుతారని, కష్టకాలంలో పార్టీలో ఉన్న వారికి న్యాయం చేస్తారని అన్నారు. హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు.

### రేగోడ్ తహసీల్దార్‌గా దత్తరెడ్డి

రేగోడ్(మెదక్): రేగోడ్ తహసీల్దార్‌గా దత్తరెడ్డి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. రైతుల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

### అఖండ దీపారాధన

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లోని గోకర్ణేశ్వర వీరహనుమాన్ దేవాలయంలో అర్చకుడు మహేశ్ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంత పంచమి సందర్భంగా ఆలయంలో అఖండ దీపారాధన ప్రారంభించారు.

## ఘనంగా బీరప్ప కల్యాణోత్సవం


టేక్మాల్(మెదక్): బొడ్మట్‌పల్లిలో బీరప్ప కల్యాణం


అంబాజిపేటలో జరిగిన పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ

టేక్మాల్(మెదక్): మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సోమవారం ఈ సందర్భంగా మహిళలు స్వామిఅమ్మవార్లకు ఓడి బియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

**అంబాజిపేటలో..**

చిన్నశంకరంపేట(మెదక్): బీరప్ప ఆలయ నిర్మాణానికి సహకరిస్తానని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని అంబాజిపేట గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బీరప్ప ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కురుమ సంఘం నాయకులు సంతోష్, రాములు, బీరయ్య, భూమయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బూరుగడ్డలో మల్లన్న జాతర

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని బూరుగడ్డలో మల్లికార్జునస్వామి జాతర ఘనంగా జరుగుతోంది. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఒగ్గుపూజారులు శేఖర్ బృందం ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. అనంతరం అగ్నిగుండాలు తొక్కి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు కొమురయ్య, మాజీ ఉపసర్పంచ్ రేణుకశేఖులు, ఉపాధ్యక్షుడు మల్లేశం, నాయకులు భిక్షపతి, బీరయ్య, శేఖులు, కుమార్, సత్తయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. జాతర సందర్భంగా గ్రామానికి చెందిన గొల్ల పాపయ్య భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.


బూరుగడ్డలో మల్లన్నస్వామికి బోనాలతో మహిళలు

## ఆటపాటలతో కూడిన బోధన అందించాలి

గజ్వేల్‌రూరల్: చిన్నారులకు ఆటపాటలతో కూడిన బోధన అందించినపుడే వారు ఇష్టంగా నేర్చుకుంటారని అదనపు సీపీ ముత్యంరాజు అన్నారు. పట్టణంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. పరిసరాలను పరిశీలించి టీచర్ నాగరాణి, ఆయా లావణ్యను అభినందించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం, ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.


చిన్నారితో ముచ్చటిస్తున్న ముత్యంరాజు